క్లుప్తంగా

ఘనంగా హిందీ దినోత్సవం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను హిందీ భాష ఐకమత్యంగా ముందుకు నడిపి బ్రిటిష్ వారిని తరిమికొట్టడంలో దోహద పడిందని హిందీ ప్రచారకులు పాట్నూరి దేవరాజ్‌కుమార్ అన్నారు. చిట్టినగర్ పరిధిలోని పలు పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చిట్టినగర్‌లోని సాయి అరుణా హైస్కూల్, లంబాడీపేటలోని శ్రీ సన్ ఫ్లవర్ ఇంగ్లిషు మీడియం, ఆర్ఆర్ వీధిలోని హార్పర్స్ హైస్కూల్‌లో హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాజ్‌కుమార్ మాట్లాడుతూ.. హిందీ మన జాతీయ భాష అని, ఆనాడు స్వాతంత్ర ఉద్యమంలో హిందీ భాష దేశప్రజలందరినీ ఐకమత్యంగా ముందుకు నడిపిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా హిందీ భాషాభివృద్ధి కోసం దోహదపడుతున్న హార్పర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు స్టీఫెన్ హార్పర్, రోజ్ హార్పర్‌లను, దేవరాజ్‌కుమార్‌లతో పాటు పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో అరుణా కాన్వెంట్ ప్రిన్సిపాల్ గుజ్జారి అప్పారావు, ఆర్.రమేష్, ఆర్.నాగలక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణాన్ని కాపాడుకుంటేనే ప్రపంచానికి భవిష్యత్ ఉంటుందని కేఎల్ విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఏ.వెంకటేశ్వరరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల పీజీ, యూజీ రసాయనశాస్త్రం ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఓజోన్ పొర క్షీణించటం ద్వారా పర్యావరణానికి పెనుముప్పు' అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గాలి, నీరు, మట్టి వంటి పదార్థాల నాణ్యతను తగ్గించే కారకాలను కాలుష్యంగా పిలుస్తామన్నారు. మానవులు తమ విలాస జీవితాల కోసం కాలుష్యానికి కారకులవుతున్నారని చెప్పారు. హిందూ హైస్కూల్ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు కాలుష్యాన్ని అరికట్టేందుకు పాటుపడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ రసాయనశాస్త్ర విభాగ విద్యార్థులుగా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. విభాగాధిపతులు కేపీటీ విజయభాస్కర్, డాక్టర్ ఓ.శైలజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లాస్‌మేట్ కుటుంబానికి ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ 1996 పదో తరగతి బ్యాచ్ విద్యార్థిని ఆళ్ల దుర్గాభవాని ఈ నెల 8న క్యాన్సర్‌తో మృతి చెందింది. ఆమె కుటుంబానికి ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. మృతురాలు దుర్గాభవానితో పాటు చదువుకున్న క్లాస్‌మేట్స్ చందు(కానిస్టేబుల్), సాంబ, శ్రీను సోమవారం స్థానిక రావిచెట్టు సెంటర్‌లోనే ఉంటున్న దుర్గాభవానీ సోదరి కొలుసు అనసూయ ఇంటికి వెళ్లి రూ.20 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ.. ఆ పేద కుటుంబానికి తమ వంతు సాయంగా కొందరు క్లాస్‌మేట్స్ సహకారంతో ఆర్థిక సాయాన్ని అందించామని చెప్పారు. ఆమె మరణం పట్ల 1996 బ్యాచ్ విద్యార్థులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.



ప్రదర్శనలో పాల్గొన్న ముస్లింలు



ఇస్లాం మత చిహ్నాలు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

ప్రపంచ శాంతిని ఆకాంక్షించేది నిజమైన ఇస్లాం అని పలువురు ముస్లిం మత గురువులు పేర్కొన్నారు. ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఈద్ మిలాద్ ఉన్ నబీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాతబస్తీలో భారీ ప్రదర్శనను నిర్వహించారు. వించిపేట మసీదు సెంటర్ నుంచి కెనాల్ రోడ్డులోని జామా మసీదు వరకు భక్తిశ్రద్ధలతో ప్రదర్శన చేపట్టారు. కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సలీముద్దీన్ నేతృత్వంలో చేపట్టిన ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. గత 25 ఏళ్లుగా ఈ పర్వదినం రోజున ప్రదర్శనను నిర్వహిస్తున్నామని సలీముద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. జామా మసీదు ప్రాంగణంలో ఉన్న ప్రవక్త కేశాన్ని ముస్లింలు దర్శించుకున్నారు. – వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)



భారీ జెండా ప్రదర్శిస్తున్న ముస్లింలు



ఇస్లాం పతాకంతో షేక్ ఆసిఫ్, నాయకులు



మేము సైతం..

ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించండి



వ్యర్థాలను తొలగించకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో సత్వరమే పారిశుద్ధ్య పనులు పూర్తి చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం కండ్రిక, ఉడా కాలనీ, రాజీవ్ నగర్, నున్న, ముస్తాబాద్ తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నుంచి వచ్చిన వ్యర్థాలను తొలగించకపోవటం, రోడ్ల వెంబడి ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన వ్యర్థాలు ఉండటం చూసి స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను మందలించారు. దగ్గరుండి వ్యర్థాలను తీసేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రామకోటేశ్వరరావుకు సూచించారు. అనంతరం ఆయన రాజీవ్ గాంధీ స్కూల్‌లో పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలించారు. స్కూల్‌లో చేయాల్సిన పారిశుద్ధ్య నిర్వహణ సత్వరమే పూర్తి చేసి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు.

వరద బాధితులకు దాతల చేయూత

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పంచాయతీ పరిధిలోని రామరాజ్యనగర్ రైల్వే కట్ట పక్కన బుడమేరు వరద ముంపునకు గురైన బాధితులకు భవానీపురం వాకర్స్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యుల సహకారంతో సోమవారం దోమ తెరలు, ప్లాస్టిక్ బకెట్, మగ్గులు, భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాము, సెక్రటరీ లంకిరెడ్డి కృష్ణారెడ్డి, ట్రెజరర్ వెంకటరెడ్డి, సభ్యులు శ్రవణం కనకారావు, జనార్దనరావు, చక్కా శ్రీనివాస్, రామచంద్రరావు, మధు, సుబ్బారావు, నారిండి కిషోర్ కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.



చీరలు అందజేస్తున్న రవీంద్రనాథ్‌బాబు తదితరులు



బాధితులకు సామగ్రి అందజేస్తున్న వాకర్స్ మిత్రులు

వరద బాధితులకు చీరల పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ప్రభుత్వంతో పాటు తోటి సంఘీయులు, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం.రవీంద్రనాథ్‌బాబు పిలుపునిచ్చారు. చిట్టినగర్‌లోని శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో సోమవారం వరద బాధితులకు చీరలు పంపిణీ చేశారు. ఏపీఎన్‌టీ సంక్షేమ సంఘం, నాయీ బ్రాహ్మణ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో బాధితులకు రూ.లక్ష విలువైన చీరలను అందజేశారు. కుటుంబ సంక్షేమ శాఖ రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ ఎం.రామనాథం, తుమ్మిడి శ్రీనివాస్, సంపాదకులు అన్నవరపు బ్రహ్మయ్య, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మల్లాపురం కనకరావు, కొమ్మవరపు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ జేఏసీ నేత సాయం

సాక్షి, అమరావతి: విజయవాడ వరద బాధితులకు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ తన కుటుంబ సభ్యుల సహకారంతో సాయం అందించారు. సోమవారం సింగ్‌నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతతో కలిసి వరద బాధితులకు దుస్తులు, బూట్లు, మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్స్, బక్కెట్లు, మగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేషనల్ నరేంద్ర మోదీ విచార్ మంచ్ సౌత్ ఇండియా ఇన్‌చార్జి పిలైజి, పగలవంజి, కరుణామూర్తి, పురుషోత్తం, రాజేంద్రన్, గోంప ప్రకాష్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వెల్ఫేర్ ఆధ్వర్యంలో..

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ వీఆర్‌ఏ వెల్ఫేర్ సర్వీస్ సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలైన జక్కంపూడి, యార్డ్ రోడ్డు, అజిత్‌సింగ్‌నగర్ కాలనీ, వాటర్ ట్యాంక్ కాలనీలో బాధితులకు 12 రకాల నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేసినట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు.

మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడపాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నడపాలని, వారంలో ఒక రోజు డ్రైడేని అమలు చేయాలని మద్య వ్యతిరేక పోరాట ఐక్యవేదిక నాయకులు డి.రమాదేవి, పి.దుర్గాభవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం రాష్ట్రంలో అమలు కానున్న నూతన మద్యం పాలసీ విధానంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం లక్ష్యం ఏమిటో బహిర్గతం చేయాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో మద్యం పాలసీలపై అధ్యయనం చేసిన బృందాల నివేదికను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు, ప్రముఖుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అక్రమ విక్రయాకాలు సాగుతున్నాయని, వాటిని అరికట్టే బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. మద్యం పాలసీని నియంత్రణ దిశగా, నేరాలు అరికట్టే విధంగా, ప్రభుత్వమే విక్రయాలు, షాపులు తగ్గించడం లక్ష్యంగా విధానాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గుడి, బడి, బస్టాండ్‌లు తదితర ప్రాంతాలకు దగ్గరగా ఉన్న దుకాణాలను రద్దుచేయాలని కోరారు. బెల్ట్ షాపుల అమ్మకాలు నిరోధించాలని, ప్రతి పీహెచ్‌సీలో డీ ఎడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని, అధికార యంత్రాంగాన్ని, అధికార పార్టీ ప్రజాప్రతినిధులను మద్య నియంత్రణ లక్ష్యంగా పనిచేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్యం వ్యతిరేక పోరాట ఐక్యవేదిక నాయకులు సుంకర పద్మశ్రీ, పి.పద్మ, ఎస్.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన వినాయక ఉత్సవాలు



స్వామివారి లడ్డూ ప్రసాదంతో శ్రీనివాస్, చిత్రంలో డీవీఎం కృష్ణ చైతన్య తదితరులు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న షేక్ ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి (ఏపీటీడీసీ) సంస్థకు చెందిన బెరంపార్క్(పున్నమి హోటల్) ప్రాంగణంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో హుషారెత్తించే పాటలకు సంబంధిత శాఖ ఉద్యోగులు, సిబ్బంది అంతా కలిసి డ్యాన్స్‌లు చేస్తూ సందడి చేశారు. కుల, మతాలు, వయసు, హోదాలతో సంబంధం లేకుండా ఒకరికొకరు గులాం పూసుకుంటూ.. ఆలింగనం చేసుకుంటూ తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడికి తుది వీడ్కోలు పలికారు. నిమజ్జనానికి ముందు ఉత్సవాల్లో భాగంగా గణనాథునికి వేసిన రూ.10 వేలు విలువ చేసే వంద రూపాయల నోట్ల దండను ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ మేనేజర్ పరుచూరి కృష్ణ చైతన్య రూ.38 వేలకు దక్కించుకున్నారు. అలాగే స్వామివారికి సమర్పించిన 10 కేజీల లడ్డూ ప్రసాదాన్ని బెరంపార్క్ యూనిట్ మేనేజర్ కె.శ్రీనివాస్ రూ.35 వేలకు పాడుకున్నారు. గణపతి పూజలో ఏర్పాటు చేసిన హుండీని రూ.41 వేలకు నల్లమోతు నాగార్జున దక్కించుకున్నారు. వేడుకల్లో సిబ్బంది నాగు, గంగరాజు, సుధీర్, దుర్గారావు, మన్నం కొండయ్య, బొర్రా తిరుపతి రావు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

చవితి పందిళ్లు మత సామరస్యానికి ప్రతీక

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో కులమతాలకు అతీతంగా యువత వినాయచవితి వేడుకలను నిర్వహించటం మత సామరస్యానికి ప్రతీక అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో చవితి పందిళ్లను షేక్ ఆసిఫ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహంతిపురంలోని ఓంశ్రీ గణనాథ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సుమారు 2 వేల మందికి జరిగిన అన్న ప్రసాదం వితరణ కార్యక్రమాన్ని ఆసిఫ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ ప్రముఖులు మంతెన నరేంద్ర, వీర్ల వాసు యాదవ్, సింగంశెట్టి అరుణ్‌కుమార్, దుర్గానందు, దాడి రాజా, ముత్యాల చంద్రశేఖర్, బండి నారాయణరెడ్డి, నాని, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయ గణపతిగా దర్శనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని బాల గణపతి విజయగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్తీ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి దేవస్థానంలో కొలువై ఉన్న స్వామి వారి సన్నిధిలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా స్వామివారు సోమవారం విజయగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి వెంకటకృష్ణారావులు పర్యవేక్షించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో వైభవంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంధి శ్రీనివాసరావు దంపతులు ఉదయం జరిగిన హోమంలో పాల్గొని పూర్ణాహుతి గావించారు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి స్వచ్ఛతాహి సేవలో అందరూ పాల్గొనాలి

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొనాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర నగర పౌరులకు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో మంగళవారం జరిగే స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ప్రారంభోత్సవానికి కావలసిన ఏర్పాట్లను సోమవారం ఆయన అధికారులతో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. గాంధీజీ ఆశయంగా స్వచ్ఛభారత్ మిషన్ గా 2014 లో మొదలైన స్వచ్ఛ భారత్ – 2024కు 10 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో అందరూ పాల్గొని, స్వచ్ఛ విజయవాడలో భాగస్వాములు కావాలని చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమం మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఉదయం 7.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అడిషనల్ కమిషనర్ సత్యవతి, డెప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్ పాల్గొన్నారు.

వరద.. తీరని వ్యథ

బుడమేరుకు వచ్చిన వరద నగర వాసులకు తీరని వ్యథను మిగిల్చింది. వరద వచ్చి 16 రోజులు గడిచినా బాధితుల కష్టాలు తీరడం లేదు. ఇళ్లలోని సామగ్రి పూర్తిగా పాడైపోవడంతో వాటిని శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. సాయం కోసం బాధితులు ఎదురుచూస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్స్, విజయవాడ



రామరాజ్యనగర్‌లో డాక్యుమెంట్లను ఆరబెట్టిన మహిళ



సింగ్‌నగర్‌లోని ఓ షోరూమ్ వద్దకు చేర్చిన ముంపునకు గురైన వాహనాలు



సింగ్‌నగర్ ఎంకే బేగ్ హైస్కూల్‌లో తడిసిన పుస్తకాలు



న్యూ రాజరాజేశ్వరిపేటలో తడిసిన పుస్తకాలను ఆరబెట్టుకుంటున్న చిన్నారులు



రామరాజ్యనగర్‌లో ఓ ఇంట్లో పాడైపోయిన సామగ్రి